క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



ముత్తంశెట్టికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో నరసింహరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవోనరసింహరాజు అందజేశారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నాయకులు ఎన్. ప్సారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

22 నుంచి హనుమత్ వ్రత ఉత్సవాలు



సింహగిరి మెట్లమార్గంలోని ఆంజనేయస్వామి

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 24 వరకు హనుమత్ వ్రత ఉత్సవాలు నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. 22న ఉదయం 7.30 గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం సుందరకాండ పారాయణ నిర్వహించడం జరుగుతుందన్నారు. 23న సుందరకాండ పారాయణ, 24న ఉదయం 6.30 గంటల నుంచి 7గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, 7 నుంచి విశేష అలంకరణ, 7.30 గంటల నుంచి లక్ష తమలపాకుల పూజ, 9 గంటల నుంచి పట్టాభిషేక పారాయణం, 9.30 గంటల నుంచి విశేష హోమం, పూర్ణాహుతి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న సంస్థ జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో దీపాంజలినగర్ జీవన్‌రేఖ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన సర్వైకల్ క్యాన్సర్ పై అవగాహన..స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా, దీపిక లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు అంజుసిన్హా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు విజయ గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. గైనకాలజిస్టును సంప్రదించడంతో పాటు ఆహార నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జీఎం మాథ్యూ ఇ కోవూరు, హెచ్‌ఆర్ హెడ్ బి.బి. పాత్ర, సీఐఎస్ఎఫ్ డీసీ వి.కె.ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు యతీష్‌చంద్ర



జాతీయ పోటీలకు ఎంపికైన యతీష్‌చంద్ర

పరవాడ: నంద్యాలలో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన సుమేధ విద్యానికేతన్ విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జాజుల యతీష్ చంద్రను పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయలక్ష్మి తదితరులు శనివారం అభినందించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 9885181097

సర్కారు బడి.. కార్పొరేట్ ఒరవడి

ఇది కదా అభివృద్ధి

డిజిటల్ బోధన పద్ధతులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వినూత్న మార్పుల దిశగా ముందడుగు వేసింది. నవ శకానికి నాంది పలికింది. మిగిలిన ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచింది. లక్షలాది రూపాయిలతో ఒక్కో పాఠశాలలో ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేసింది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఏర్పాటు చేసి బోధించడంతో విద్యార్థులు ఆసక్తిగా పాఠాలు వింటున్నారు. ఈ పద్ధతిపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- బోధనలో నవశకం
- తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు
- బిగ్ స్క్రీన్‌లపై బోధన



డిజిటల్ బోధనను శ్రద్ధగా వింటున్న విద్యార్థులు



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిజిటల్ విధానంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు



ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సబ్బవరం: విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించారు. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందించగా.. ఇటీవల పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) అందించారు. వీటి ద్వారా విద్యార్థులకు దృశ్య, శ్రవణ పద్ధతుల్లో పాఠాలు బోధిస్తున్నారు. ఒక్కో తరగతి గదికి ఒక్కో ప్యానల్‌ను అమర్చారు. ఒక్కో బోర్డు విలువ మూడు లక్షల పైమాటే. ఐఎఫ్‌పీల ద్వారా విద్యా బోధన వల్ల మెలకువలు, లైవ్ మోడళ్లతో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఓ పక్క స్మార్ట్ టీవీగా, బోర్డుగా, డిజిటల్ క్లాస్ రూమ్‌ల నిర్వహణకు వీలుగా వీడియోలు ప్రదర్శించడానికి వీలుగా ఐఎఫ్‌పీలను పొందుపర్చారు. మొబైల్ ఫోన్‌ను వినియోగించి కావల్సిన పాఠ్యాంశం సులభంగా నేర్చుకునేందుకు ఐఎఫ్‌పీ ఉపయోగపడుతోందని విద్యార్థులు చెబుతున్నారు.



ఆరిపాక పాఠశాలలో డిజిటల్ విధానంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు ముత్యాలనాయుడు

పాఠశాలల వారీగా ఏర్పాటు చేసిన ప్యానళ్లు, డిజిటల్ బోర్డుల సంఖ్య

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల	14
సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల	10
సబ్బవరం కేజీబీవీ	06
నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	10
తవ్వవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	06
మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	06
ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	05
రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	06
బంగారమ్మపాలెం యూపీ స్కూల్	01
వంగలి యూపీ స్కూల్	01
మండలంలో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు	2,800 మంది
ఉపాధ్యాయులు	98 మంది
డిజిటల్ ఐఎఫ్‌పీలు(ఇంటరేక్టివ్ ఫ్లేట్ ప్యానల్)	65

సర్కారు పాఠశాలల్లో బోధన కార్పొరేట్‌ను తలపిస్తోంది.

ప్రయోగాత్మక విజ్ఞానం పొందే వీలు



గుండె ఇలా ఉంటుందని గతంలో బొమ్మల ద్వారా తెలుసుకునేవాళ్లం. ఇప్పుడు ఐఎఫ్‌పీల ద్వారా గుండెలో భాగాలు, గుండె పనిచేసే విధానం లైవ్‌లో చూసి అర్థం చేసుకుంటున్నాం. సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతున్నాయి.

– కె.రమ్య, పదో తరగతి, ఆరిపాక

స్మార్ట్ బోర్డులుగా..



గతంలో నల్లబల్ల, పచ్చని బల్లలు ఉండేవి. ఇప్పుడు ఐఎఫ్‌పీ వచ్చాక సుద్దముక్కలు, డస్టర్ల అవసరం కూడా ఉండడం లేదు. అక్షరాలు, బొమ్మలు కావల్సిన రంగుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ప్రైవేట్ స్కూల్స్‌లో కూడా ఈ సదుపాయాలు లేవు. మాకు కావాల్సిన పాఠాన్ని ఐఎఫ్‌పీ ద్వారా నేర్చుకుంటున్నాం. ఖాళీ పీరియడ్‌లో టీచర్ లేకపోయినా మేం కావాల్సిన పాఠ్యాంశాలు సులువుగా వేసుకుని చూస్తున్నాం. జగన్ మామయ్యకు కృతజ్ఞతలు.

– బి.శ్రీను, సబ్బవరం

విద్యార్థుల్లో ఆసక్తి



ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలతో బోధించడంతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తి పెరిగింది. ఐఎఫ్‌పీల ద్వారా మెరుగైన విద్యాబోధనకు అవకాశం కలిగింది. ఉపాధ్యాయులతో పని లేకుండా విద్యార్థులు స్వయంగా ఐఎఫ్‌పీలు వినియోగించుకోవచ్చు. బోధనలో కొత్త ధోరణికి అవకాశం కల్పించారు. దీని వల్ల ప్రయోగాత్మక విద్య అందుతోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తరగతులు సాగుతున్నాయి.

– ముత్యాలనాయుడు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు

ఐఎఫ్‌పీలతో బోధన మెరుగు



ప్యానల్ బోర్డులతో బోధనా విధానం మెరుగుపడింది. ఒకసారి పాఠ్య పుస్తకం ద్వారా బోధన చేసిన తర్వాత మళ్లీ ప్యానల్ బోర్డులు వినియోగిస్తే విద్యార్థులు చాలా సులభంగా అర్థం చేసుకుంటున్నారు. విద్యార్థులందరికీ అర్థమయ్యేలా ఉపాధ్యాయులు వీటిని వినియోగిస్తున్నారు. ఓ పక్క బ్లాక్ బోర్డుగా వాడుతూనే మరోపక్క విద్యార్థులకు వీడియో, ఆడియో ద్వారా బోధన చేసుకునే వీలు ఈ ప్యానల్ బోర్డులో ఉంది.

– ,లక్ష్మణరావు, ఎంఈవో, సబ్బవరం

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం:మండలంలోని పెదయాతపాలెం గ్రామంలోని ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీపరమేశ్వరుల ఆలయం సమీపంలో శనివారం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నమాచార్య వాగ్దేవి వరదాయిని 170వ ఇంటింటా గోవిందుడు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఉదయం పంచామృతాభిషేకాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీనివాస కల్యాణం కనుల పండువగా సాగింది. గరుడవాహన ఊరేగింపు, సాయంత్రం సహస్ర దీపాలంకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

కళా ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ



జ్ఞాపిక అందుకుంటున్న జితేంద్ర

సబ్బవరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు విశేష ప్రతిభ చాటుకున్నారు. సంప్రదాయ బొమ్మల తయారీ కేటగిరీలో అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి. జితేంద్ర రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు జిల్లా విద్యాశిక్షణ సంస్థ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గొట్టేటి రవి తెలిపారు. ఈ నెల 14,15 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర ఉత్సవాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి వివిధ కేటగిరీలో 19 మంది విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. జనవరి 9,10 తేదీల్లో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో సబ్బవరం విద్యార్థి జితేంద్ర పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపేలా విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా రవి అభినందనలు తెలిపారు. జితేంద్రకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయిని బీవీ రామలక్ష్మిని పలువురు అభినందించారు. ఏకపాత్రాభినయంలో ఇదే పాఠశాలకు చెందిన వెన్నెల మీనాక్షి ద్వితీయ స్థానంలోను, పెతకంశెట్టి గ్రీష్మ తృతీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా త్రీడీ విభాగంలో శరగడం చిత్ర తృతీయ స్థానంలో నిలిచినట్లు రామలక్ష్మి తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగమల్లేశ్వరరావు అభినందించారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

విశాఖ విద్య: పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల ప్రిన్సిపాళ్ల, ఉపాధ్యాయులకు 'పాఠశాలల్లో విద్యార్థులకు చేపట్టాల్సిన భద్రతా ప్రమాణాలు–సైబర్ సెక్యూరిటీ అంశాలు' పై జిల్లా స్థాయి వర్క్ షాప్ శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. గాజువాక మండల విద్యాశాఖాధికారి సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో గొండు సీతారాం మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యాలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. తాగునీరు మొదలుకొని మరుగు దొడ్లు, పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులపై అందే ప్రతీ ఫిర్యాదును సమయస్ఫూర్తితో స్వీకరించి వారిలో అభద్రతాభావం నెలకొల్పకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. స్కూల్ బస్ డ్రైవర్లు, కండక్టర్లుపై ఫిర్యాదులొస్తే వాటిని స్వీకరించేందుకు ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టెలను ప్రతీ పాఠశాలలో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో సైబర్ సెక్యూరిటీ, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీఈఆర్టీ చైల్డ్ సేఫ్టీ రాష్ట్ర నోడల్ అధికారి ఎం.సోమశేఖర్ మాట్లాడుతూ జాతీయ,రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ల ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, భద్రతా ప్రమాణాల్లో భాగంగా వివిధ రకాల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతినిధి నిహారిక, భీమిలి డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ రవి, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన కార్యదర్శిగా రామగోవిందరావు



పరవాడ: జనసేన జిల్లా కార్యదర్శిగా మండలంలోని ఈ.బోనంగి గ్రామానికి చెందిన బుగిడి రామగోవిందరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయని గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో పని చేస్తానని పేర్కొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న రామునాయుడు

పెందుర్తి: అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా పనిచేస్తామని బీజేపీ పెందుర్తి అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. మండలంలోని పినగాడి, రాంపురం గ్రామాల్లో శనివారం వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో డిజిటల్ స్క్రీన్‌పై ప్రధాని నరేంద్రమోదీ అందిస్తున్న పథకాలను చూపించారు. కార్యక్రమంలో పినగాడి గ్రామ సెక్రటరీ మల్లికార్జున, రాంపురం గ్రామ సెక్రటరీ పైడిరాజు, బీజేపీ పెందుర్తి మండల అధ్యక్షుడు కాళ్ల జగన్‌మోహన్, నాయకులు సన్యాసిరావు, అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి పాలిటెక్నిక్‌లో ఉపాధి కోర్సు

పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని ఆటోమేషన్ సెంటర్‌లో ఎంబెడెడ్ సిస్టమ్స్ మరియు పీఎల్‌సీలో నాలుగు నెలల కోర్సు ప్రతిపాదించినట్టు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. శిక్షణ ఉచితంగా ఉటుందని పేర్కొన్నారు. 2022, 2023 సంవత్సరాల్లో ఈఈఈ, ఈసీఈ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో మూడు సంవత్సరాల డిప్లమో కోర్సు పూర్తి చేసి సరైన ఉపాధికోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు చేరవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 23వతేదీ లోగా 7674014444 నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆరుగురు పేకాటరాయళ్ల అరెస్టు

పెందుర్తి: మండలంలోని నరవలో పేకాట ఆడుతున్న ఆరుగురిని నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాలు.. నరవ ప్రభుత్వ హైస్కూల్ వెనుక ఉన్న బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాలతో ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 61,040 రూపాయిలతో పాటు 5 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.అనంతరం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో వారిని అప్పగించారు.

బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సపై వైద్యులకు అవగాహన



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్నవైద్యులు

ఎంవీపీకాలనీ: బ్రెయిన్ స్ట్రోక్ పై యువ వైద్యులకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ సొసైటీ ఆఫ్ న్యూరో రేడియాలజీ , స్ట్రోక్ ఆఫ్టేట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో జాతీయ కాన్ఫరెన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ రేడియోలజిస్ట్ మెడికవర్ హాస్పటల్స్, ఐఎస్ఎన్ఆర్–2023 ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శిభా శంకర్ దళాయి అధ్యక్షతన శనివారం నోవెటల్ హోటల్‌లో ఈ కాన్ఫరెన్స్ జరిగినట్లు మెడికవర్ యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా డాక్టర్ శిభా శంకర్ దళాయి మాట్లాడుతూ బ్రెయిన్ స్ట్రోక్ సమస్యకు చికిత్స విధానంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆధునిక వైద్య సౌకర్యాలు ఎలా ఉన్నాయి, శస్త్ర చికిత్స సమయంలో మెళకువలు ఎలా పాటించాలని అనే విషయంపై యువ వైద్యులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. 30 మంది సీనియర్ డాక్టర్లు, ప్రొఫెసర్లు ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరయ్యారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 500 మంది యువ వైద్యులు పాల్గొన్నారు. ఐఎస్ఎన్ఆర్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలేష్ గైక్వాడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ అరవింద్ వర్మ దాట్ల తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఆధ్యాత్మిక సందడి



బేడా తిరువీధిలో అప్పన్న ఉత్సవమూర్తులు



పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు నాలుగోరోజు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం అయ్యవారి సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీలో అదిష్టింపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో వేంచేయజేసి దివ్యప్రబంధపారాయణాలు పఠించారు. దీంతో సింహగిరిపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఎంఈవో మూర్తి తదితరులు

సబ్బవరం: మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను శనివారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఇందులో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఫెయిర్‌ను ఎంఈవోలు లక్ష్మణరావు, మూర్తి ప్రారంభించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విజేతలను ప్రకటించారు. వ్యక్తిగత కేటగిరిలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రూప్ కేటగిరీలో గురుకుల పాఠశాల విద్యార్థులు, టీచర్ కేటగిరిలో నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో నాయకులు కొటాన రాము, బోకం రామునాయుడుతో పాటు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం



పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు

సీతమ్మధార: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి రైల్వే స్టేషన్ దరి పోస్టాఫీస్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ తన సిబ్బందితో వారిని విచారించారు. గంజాయి ఉన్నట్లు గుర్తించి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి 14 కిలో గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, కీప్యాడ్ 1 స్వాధీనం చేసుకున్నారు. చెన్నై కాశీపురానికి చెందిన ప్రశాంత్ అనే ఆటో డ్రైవర్, తమిళనాడు, మిల్క్ కాలనీ మాధవవరానికి చెందిన వెల్డర్‌గా పనిచేస్తున్న భాషిర్ అనే వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com